క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 7న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. శ్రీనగర్‌కాలనీ, ప్రేమ్‌నగర్ కాలనీ, పోచమ్మకుంట ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు, భవానినగర్, హౌజింగ్ బోర్డు కాలనీ, వికాస్‌నగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు 108లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

కాశిబుగ్గ: జీవీకే ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ 108 అంబులెన్స్‌లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ) ఉద్యోగాలకు వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాలలో నేడు (గురువారం) ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా మేనేజర్ పిట్టల రాజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9121108726, 9948426826 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపు విద్యుత్ లోకల్ కోర్టు

హన్మకొండ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 8న మామునూరులో లోకల్ కోర్టు నిర్వహించనున్నట్లు ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్) చైర్మన్ ఎన్.వి.వేణుగోపాలచారి తెలిపారు. మామునూరువిద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు లోకల్ కోర్టు కొనసాగుతుందని ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

మేయర్‌ను కలిసిన సెక్రటరీ



వరంగల్ అర్బన్: నగర మేయర్ గుండు సుధారాణిని బల్దియా సెక్రటరీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సెక్రటరీ లక్ష్మి అలువేలు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మేయర్‌కు పూలమొక్క అందజేశారు.

హనుమకొండ సర్కిల్ పీఓగా కిరణ్



హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ పర్సనల్ ఆఫీసర్‌గా ఎం.కిరణ్ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడ పర్సనల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మాధవి కొత్తగూడెంకు వెళ్లారు. పెద్దపల్లిలో జూనియర్ పర్సనల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎం.కిరణ్‌కు పర్సనల్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పించి హనుమకొండ సర్కిల్‌కు బదిలీ చేశారు.

నియామకం

వరంగల్: వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ ఇన్‌చార్జ్ సూపర్‌వైజర్‌గా శ్రీనునాయక్‌ను మార్కెట్ కార్యదర్శి నిర్మల బుధవారం నియమించారు. ప్రస్తుతం సూపర్‌వైజర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మురళీయాదవ్ విధుల్లో నిర్లక్ష్యం చేయడంతో మార్కెట్ కార్యదర్శి మురళికి మోమో ఇచ్చినట్లు సమాచారం.

పద్మశాలి సంఘం అసోసియేట్ అధ్యక్షుడిగా డాక్టర్ చందా మల్లయ్య



కాజీపేట అర్బన్: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అసోసియేట్ అధ్యక్షుడిగా డాక్టర్ చందా మల్లయ్య ఎన్నికయ్యారు. ఈమేరకు సంఘం సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పట్టానే మార్చారు

హసన్‌పర్తి: తన భూమిని అక్రమంగా మరొకరి పేరుపై మార్చారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు స్థానిక ఎమ్మెల్యే నాగరాజుకు బాధితుడు బుధవారం ఫిర్యాదు చేశారు. వంగపహాడ్ గ్రామంలోని సర్వే నంబర్ 215లో రుద్రారపు సాయిలుకు సుమారు 0.32 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని క్యాతం లక్ష్మి పేర 0.16 ఎకరాలు, క్యాతం కుమారస్వామి పేరుపై మరో 0.16 ఎకరాలు పట్టా చేశారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఆ నిర్ణయం సరికాదు

హన్మకొండ: కులగణన, ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను ఉపాధ్యాయులతో నిర్వహించే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు. కులగణనకు ప్రభుత్వ ఉపాధ్యాయులను నియమించడం, ఈ నెల 30 వరకు ఒకపూట బడులు నిర్వహించడంపై సరికాదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకపూట బడులతో పేద, బడుగు బలహీన వర్గాల పిల్లలు నష్టపోతారని తెలిపారు. ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడానికా లేక సర్కార్ పని చేయడానికా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

దేవాలయ సిబ్బందికి సన్మానం



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో సేవలందిస్తున్న సిబ్బందిని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి బుధవారం సన్మానించారు. భారత ప్రభుత్వ ఆహార పరిరక్షణ ప్రమాణాల అధికారిక సంస్థ ఈట్ రైట్ ప్లేస్ ఆఫ్ వర్షిప్ సర్టిఫికెట్ (భోగ్)ను దేవాలయానికి మంగళవారం అందజేసినందుకు సిబ్బందిని సత్కరించి అభినందనలు తెలిపారు.

సంధ్యా సమయాన.. కిలకిల రావాలు!





సంధ్యా సమయం.. చెట్లపై పక్షుల కిలకిలరావాలు మంత్ర ముగ్ధులను చేశాయి. అటువైపు వెళ్లిన బాటసారులు, రైతులు, వాహనదారులు ఆసక్తిగా తిలకించారు. హసన్‌పర్తిలో బుధవారం కనిపించిన ఈ అద్భుత దృశ్యాన్ని ‘సాక్షి’ క్లిక్‌మనిపించింది. – హసన్‌పర్తి

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి



నిరాహార దీక్ష చేస్తున్న జీపీ కార్మికులు

వరంగల్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించి పెండింగ్ వేతనాలు చెల్లిస్తూ, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చాగంటి వెంకటయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి డిమాండ్‌చేశారు. సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ కలెక్టరేట్ ఎదుట బుధవారం ఒకరోజు నిరాహార దీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ లెక్కల ప్రకారంగా 52వేల మంది కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారని వివరించారు. వారంతా గ్రామాల్లో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్లు, డంపింగ్ యార్డ్, హరితహారం, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠ ధామాలను పర్యవేక్షిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారని గుర్తుచేశారు. ఈక్రమంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అశోక్, రాజేందర్, ఉస్మాన్, రమేష్, సాయిలు, ఉపేంద్ర, యాకమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వాడకంతో అనేక ఇబ్బందులు



సదస్సులో మాట్లాడుతున్న రాంచందర్

మడికొండ: పొగాకు వాడకం ద్వారా అనేక సమస్యలు వస్తాయని హెల్త్ సూపర్‌వైజర్ రాంచందర్ హెచ్చరించారు. ఈమేరకు తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. టోబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 2.0 కార్యక్రమంలో భాగంగా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దాసరి ఉమమహేశ్వరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రామచందర్ మాట్లాడారు. విద్యాసంస్థలు పొగాకు రహిత విద్యాసంస్థలుగా ఉండాలని, పొగాకు రహిత యువతగా మార్చుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. మానవ శరీరం నికోటిన్‌కు అలవాటు పడి, తర్వాత వ్యసనానికి గురై జీవితంలో అనేక ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ అహ్మద్, సోషల్ వర్కర్ ఎం.నరేష్, తదితరులు పాల్గొన్నారు.

బీవీ.రావు ఆశయాలు కొనసాగిద్దాం



కోడిగుడ్లను పంపిణీ చేస్తున్న నెక్ సభ్యులు

కాజీపేట అర్బన్: పౌల్ట్రీరంగ పితామహుడు డాక్టర్ బీవీ.రావు ఆశయాలను కొనసాగిద్దామని నెక్ వరంగల్ లోకల్ కమిటీ చైర్మన్ ఆవుల చంద్రయ్య అన్నారు. హంటర్‌రోడ్డులోని నెక్ కార్యాలయంలో బీవీ.రావు 89వ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈమేరకు బీవీ.రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని కోళ్ల రంగంలో ప్రథమ స్థానంలో నిలపాలనే బీవీ.రావు ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. నెక్ వరంగల్ జోనల్, టీపీఎఫ్ సభ్యుడు త్రిపురనేని సుబ్రహ్మణ్యం, టీపీఎఫ్ వరంగల్ రీజియన్ అధ్యక్షుడు వెనెపల్లి రామారావు, పునాటి హరిబాబు, డబ్ల్యూపీఎఫ్ఏ ఉపాధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్యాంసుందర్, కోశాధికారి మార్త రాంప్రసాద్, రాంచందర్, వీరన్న, కరుణాకర్‌రెడ్డి, రమణారెడ్డి, గాదె రాజేందర్, గాంధీ, ప్రతాప్‌రెడ్డి, పాషా, ధనుంజయ్, రాజేశ్వర్‌రావు, వినయ్‌పటేల్ పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్యా విధానానికి పోరాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహరావు

విద్యారణ్యపురి: శాస్త్రీయ విద్యావిధానం, సమానత్వపు సమాజ స్థాపనే ధ్యేయంగా పోరాడుదామని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహరావు సూచించారు. హనుమకొండలోని ప్రభుత్వ హనుమకొండ జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ కమిటీ ఆధ్వర్యంలో విప్లవ విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య భారతంలో పాలకులు ఉచిత నాణ్యమైన విద్యను అందించడంలో విఫలమయ్యారని విమర్శించారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం విద్యారంగాన్ని కాషాయీకరణ చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ఆలువాల నరేష్, వినయ్, బాలు, హర్ష, వంశీ, శివాజీ, కార్తీక్, మనోహర్, రాఘవ, రాజేష్, ప్రకాశ్, వినయ్, అజయ్, సాహితీ, చందన తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ చరిత్ర తెలిసేలా కార్యక్రమాలు



సభ్యత్వాలు అందజేస్తున్న సీపీఐ నాయకులు

కాశిబుగ్గ: భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 100 ఏళ్లలోకి అడుగుపెడుతున్న వేళ వాడవాడలో ఎర్ర జెండాలు ఎగురవేసి, పార్టీ చరిత్ర తెలిసేలా కార్యక్రమాలు చేపట్టాలని కార్యకర్తలకు సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దేశంలో దోపిడీ పాలక వర్గాలు అవలంబించే విధానాలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన సీపీఐ నిలబడి వందేళ్లుగా పోరాటం చేస్తోందని వివరించారు. దున్నేవాడికే భూమి కావాలని భూసంస్కరణలు వచ్చే విధంగా అనేక పోరాటాలు, ప్రాణత్యాగాలు చేసి లక్షల ఎకరాలను పేదలకు పంచిందని గుర్తుచేశారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పార్టీ ఆధ్వర్యంలో పోరాడినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి బుస్స రవీందర్, నాయకులు గన్నారపు రమేష్, మేడిద అశోక్, పంజాల రమేష్, బాషుమియా, జన్ను రవి, సుధీర్, శరత్, స్వప్న, షబానా తదితరులు పాల్గొన్నారు.

జీవిత భాగస్వాముల సహకారంతోనే ఆర్టీసీ అభివృద్ధి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్ఎం

హన్మకొండ: ఆర్టీసీ ఉద్యోగుల జీవిత భాగస్వాములతోనే సంస్థ అభివృద్ధి చెందుతుందని వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను అన్నారు. హనుమకొండలోని ఆర్టీసీ డిస్పెన్సరీలో ఆర్టీసీ వరంగల్-1 డిపో ఉద్యోగి భాగస్వామి ఆరోగ్య పరీక్షల హెల్త్ క్యాంపును విజయభాను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. ప్రతిఒక్కరూ ఆహార నియమాలు పాటించాలని సూచించారు. ఉద్యోగులు డ్యూటీకి వచ్చే సమయంలో వారి ఆరోగ్య రక్షణ కోసం రుచికరమైన భోజనం అందించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు కేశరాజు భానుకిరణ్, మాధవరావు, వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్ రావు, అసిస్టెంట్ మేనేజర్ చిమ్మని సంతోష్ కుమార్, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలపై వినతి



హన్మకొండ అర్బన్: రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు కోరారు. ఈమేరకు అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీసీఎస్ఓ ఎస్.రవిని రేషన్ డీలర్ల సంఘం నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ రేషన్ డీలర్లకు కార్డుకు 5 కిలోల చొప్పున గోధుమలు కేటాయించాలని, రేషన్ షాప్‌లకు 31వ తేదీలోపు బియ్యం సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఏ నెల కమిషన్ ఆ నెలా వచ్చేలా కమీషన్ ఫైల్ ఫార్మట్ తయారు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చీలగని మోహన్, ఉపాధ్యక్షులు, మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

‘తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్య తీసుకోవాలి’

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో గలాటా సృష్టించి, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రెస్ క్లబ్ బాధ్యులు కోరారు. ఈమేరకు సుబేదారి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ బాధ్యులు మాట్లాడుతూ బుధవారం కొంతమంది ప్రెస్ క్లబ్‌లోకి ప్రవేశించి ప్రెస్ క్లబ్ బాయ్, కోశాధికారి, క్లబ్ బాధ్యులు, జర్నలిస్టులపై దురుసుగా ప్రవర్తించి, దుర్భషలాడారని పేర్కొన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డిని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కోశాధికారి బోళ్ల అమర్, ఉపాధ్యక్షులు గోకారపు శ్యామ్, బుడిగె శ్రీను, జర్నలిస్టులు కిషోర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

హసన్‌పర్తి: కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యంలో తరుగుతీస్తే తాట తీస్తానని, ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. హసన్‌పర్తి మండలంలోని హసన్‌పర్తి, వంగపహాడ్, నాగారం, అన్నాసాగరం, జయగిరి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ కాని వారికి నెలరోజుల్లో మాఫీ వర్తింపజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహరెడ్డి, ప్రాథమిక సహకార సంఘాల అధ్యక్షులు బిల్లా ఉదయ్‌కుమార్ రెడ్డి, మేర్గు రాజేష్‌గౌడ్, చల్లా గోపాల్‌రెడ్డి, నోడల్ ఆఫీసర్ జగన్మోన్ రావు, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు పొన్నాల రఘు, కిరణ్, వెంకటస్వామి, దోమ కుమార్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తిరుపతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, మాజీ వైస్ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మదన్‌గౌడ్, జీవన్‌రెడ్డి, అనిల్, ఏఓ అనురాధ, పీఏసీఎస్ డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు. కాగా, కార్యక్రమం సందర్భంగా ప్రొటోకాల్ నిబంధనలు విస్మరించారని పలువురు పేర్కొంటున్నారు. కాంగ్రెస్ నాయకులే ముందు వరుసలో ఉండి కొబ్బరికాయలు కొట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి

సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభం



కరీమాబాద్‌లో వివరాలు సేకరిస్తున్న అధికారులు

ఖిలా వరంగల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే బుధవారం వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలో ప్రారంభమైంది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే శివనగర్, ఖిలా వరంగల్, ఉర్సు కరీమాబాద్, ఎస్ఆర్ఆర్‌తోట, రంగశాయిపేట, శంభునిపేట, కాశికుంట, శాకరాసికుంట ప్రాంతాల్లోని పలు డివిజన్లలో అధికారులు పర్యటించారు.

పక్కాగా సర్వే చేపట్టాలి

హసన్‌పర్తి: కుల సర్వేను పక్కాగా చేపట్టాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సూచించారు. హసన్‌పర్తి మండలం నాగారం, గ్రామంలో కులగణన సర్వేను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేకరించిన సమాచారాన్ని కంప్యూటరీకరణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంపీఓ కర్ణాకర్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్రామ్ నర్సింహరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తంగళ్లపల్లి తిరుపతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేయూలో వర్క్‌షాప్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో కేస్ మెథడ్ ఆఫ్ టీచింగ్ అనే అంశంపై ఒకరోజు కార్యశాలను ఈనెల 8న ఉదయం నిర్వహించనున్నారు. ఈమేరకు వర్క్‌షాప్ పోస్టర్లను కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, అధ్యాపకులు బుధవారం ఆవిష్కరించారు. రూ.250 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి హాజరు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అమరవేణి తెలిపారు. కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్ మెంట్ విభాగం ప్రొఫెసర్లు కట్ల రాజేందర్, వరలక్ష్మి, అధ్యాపకులు ఫణీంద్ర, గిరిప్రసాద్ పాల్గొన్నారు.

హిస్టరీ, టూరిజం ఆధ్వర్యంలో..

కాకతీయ యూనివర్సిటీలోని హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో డిసెంబర్ 7నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న, యాన్యువల్ కాంగ్రెస్ ఆఫ్ ది ఎపిగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా, 43వ యాన్యువల్ నేమ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి సంబంధించిన పోస్టర్లను కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, తదితరులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ మల్లారెడ్డి, సోషల్ సైన్స్ డీన్ మనోహర్, రిటైర్డ్ విజయబాబు, అధ్యాపకులు డాక్టర్ బ్రహ్మయ్య, కేవీఎస్ నరేందర్, సుమంత్, నాగేశ్వర్‌రావు, కుమారస్వామి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

యోగా, ధ్యానంతో మానసిక ప్రశాంతత

హన్మకొండ: యోగా, ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని సెయింట్ పీటర్స్ ఎడ్యు స్కూల్ కరస్పాండెంట్ ఎన్.నారాయణ రెడ్డి అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో హాలండ్ వేదిక్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు జరిగే భావాతీత ధ్యాన్య శిక్షణ తరగతులను ఆయన బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వేదిక్ యూనివర్సిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పీసీ.శేఖర్ రెడ్డి, వరంగల్ ఇన్‌చార్జ్ పి.రమేష్, మెడిటేషన్ టీచర్లు పి.కొండల్ రెడ్డి, పి.రమాదేవి, కే.సుభాష్, పి.శ్రీదేవి, బి.మల్లికార్జున్, పి.వైష్ణవి పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపొద్దు

హన్మకొండ: ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపొద్దని, సానుభూతితో వ్యవహరించాలని హనుమకొండ జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ ప్రోగ్రాం ఆఫీసర్ స్వప్నమాధురి సూచించారు. హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి ఫిజియోథెరపీ కళాశాలలో కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్శిటీ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో రెడ్ రిబ్బన్ క్లబ్ పీర్ లీడర్స్ సదస్సు జరిగింది.

స్కాలర్‌షిప్ విద్యార్థుల హక్కు

విద్యారణ్యపురి: స్కాలర్‌షిప్ ప్రభుత్వ భిక్ష కాదని, విద్యార్థుల హక్కు అని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబు డిమాండ్‌చేశారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో నయీంనగర్ రోడ్డులో బుధవారం రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ హనుమకొండ జిల్లా కన్వీనర్ ఆరెపల్లి సుజిత్, వరంగల్ మహానగర కార్యదర్శి తాళ్లపెల్లి అరుణ్, జోనల్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్, బాధ్యులు శ్రీకాంత్, రోహిత్, వివేక్, కావ్య, అంజలి, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ఫీజులు చెల్లించం..

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షలు ఫీజులను తాము చెల్లించబోమని, పరీక్షలను యూనివర్సిటీ యథావిధిగా నిర్వహించాలని కేయూ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు కోరారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డిని బుధవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం రెండు, మూడేళ్లుగా విడుదల చేయలేదని పేర్కొన్నారు. వారి విజ్ఞప్తిని కేయూ రిజిస్ట్రార్ నిరాకరించారు. ఫీజు గడువును పొడిగిస్తున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి

హసన్‌పర్తి: ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి అన్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎంజేపీ, డిగ్రీ కళాశాలల్లో శాసన మండలి ఓటరు నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్‌టీయూ టీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తాను బరిలో ఉంటున్నట్లు ప్రకటించారు. పీఆర్‌టీయూ టీఎస్ హసన్‌పర్తి మండల అధ్యక్షుడు చాడ సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తిరుపతిరెడ్డి, శ్రీధర్, ప్రభాకర్‌రెడ్డి, సుమాదేవి, మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

11, 12వ తేదీల్లో టీయూటీఎఫ్ మహాసభలు

ఖిలా వరంగల్: ఈనెల 11, 12వ తేదీల్లో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరగనున్న తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆరో విద్యా మహాసభలను విజయవంతం చేయాలని టీయూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జాటోతు లకుపతి పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ శంభునిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

మేర కులం అని వెల్లడించాలి

రామన్నపేట: ఈనెల 6వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరగనున్న సమగ్ర కులగణన సర్వేలో తమ కులం మేర అని మాత్రమే సర్వే అధికారులకు తెలపాలని సంఘం రాష్ట్ర నాయకులు సంగ వెంకట్రాజం పేర్కొన్నారు. వరంగల్ ఎల్లంబజార్‌లోని మేర భజన మందిరం ట్రస్ట్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేర కులాన్ని చాలా మంది వాడుక భాషలో మేరు, దర్జీ, చిప్పొలు అని టైలర్ అని పిలుస్తారని అన్నారు.

ప్రజా ఉద్యమాలే ప్రత్యామ్నాయం

హన్మకొండ: దేశంలో పెరిగిపోతున్న మతోన్మాద నియంతృత్వ, ప్రజా వ్యతిరేక విధానాలను ఎదుర్కోవాలంటే కమ్యూనిస్టు వామపక్ష సామాజిక శక్తులు ఐక్యంగా, బలమైన ప్రజా ఉద్యమాలను చేపట్టాలని, ఆ దిశగా ఎంసీపీఐ(యూ) కృషి చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గడ్డం నాగార్జున తెలిపారు. ఈనెల 7న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

నవచేతన పుస్తక ప్రదర్శన ప్రారంభం

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ అశోకా కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన నవచేతన పుస్తక ప్రదర్శనను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుస్తకాలు విజ్ఞాన నేస్తాలని అన్నారు. బుక్ హౌజ్ మేనేజర్ ఎర్ర నాగరాజు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి భిక్షపతి, అరసం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వీరస్వామి, నజీర్, టీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంతోష్ పాల్గొన్నారు.

కరాటే పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఖిలా వరంగల్: ఈనెల 7న గోవాలో అంతర్జాతీయ కరాటే పోటీలకు వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని వరంగల్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈమేరకు శివకుమార్, నిలేష్, విశాల్, విజయకుమారి, రిషిత, వర్షిత్, శ్రీహన్, సంజయ్ సచిన్, లౌక్య శ్రీ, విస్మిత, హర్షిత్‌ను పాఠశాలలో ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

రిటైర్డ్ పెన్షనర్లకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు

కాజీపేట: కాజీపేట పట్టణంలోని రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయం ఆవరణలో 200మంది పెన్షనర్లకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను బుధవారం జారీ చేశారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల నమోదు కేంద్రాన్ని రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ కాజీపేట బ్రాంచ్ కమిటీ సభ్యుడు గుర్రపు సుధాకర్ ప్రారంభించారు. విద్యాసాగర్, కృష్ణమూర్తి, చంద్రమోహన్, నగేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతిభా పాటవ పోటీల్లోనూ సత్తాచాటాలి

హన్మకొండ / విద్యారణ్యపురి: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతోపాటు ఆసక్తి గల ప్రతిభాపాటవ పోటీల్లోనూ విద్యార్థులు సత్తాచాటాలని హనుమకొండ జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ సూచించారు. భారత వికాస్ పరిషత్ (బీవీపీ) హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో హనుమకొండలోని సెయింట్ పీటర్స్ హైస్కూల్‌లో జిల్లా స్థాయిలో విద్యార్థులకు బుధవారం క్విజ్ పోటీలను నిర్వహించారు. హైస్కూల్ కరస్పాండెంట్ మధ్యాస్‌రెడ్డి, బీవీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుధీర్‌కుమార్, జనరల్ సెక్రటరీ సత్యనారాయణ పాల్గొన్నారు.

మైసమ్మకు ప్రత్యేక పూజలు

ఖిలా వరంగల్: వరంగల్ ఏకశిలనగర్‌లో మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు బుధవారం వైభవంగా జరిగాయి. ఈమేరకు వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బత్తుల కిషన్, వాసు, చందు తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో చండీహోమం

కాశిబుగ్గ: కార్తీకమాసం మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున కాశీ విశ్వేశ్వరుడికి అర్చకులు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ఆవరణలోని యాగశాలలో చండీహోమం జరిపించారు.

వ్యక్తి అదృశ్యం

వరంగల్: వరంగల్ కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన నామని రమేష్ (43) మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దాంతో అతడి భార్య ఉమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకుర్ తెలిపారు.

పీడీఎస్ బియ్యం సీజ్

మడికొండ: పీడీఎస్ బియాన్ని సీజ్ చేసినట్లు మడికొండ పోలీసులు తెలిపారు. ఆటోలో 5 క్వింటాళ్ల బియాన్ని అక్రమంగా తలిస్తుండగా సత్యసాయి కన్వెన్షన్ హాల్ వద్ద బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే, అయోధ్యపురం రైల్వేగేట్ వద్ద ఆటోలో 4క్వింటాళ్ల బియాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులు కొపూరి నవీన్, కొపూరి వెంకటేశ్వర్‌రావుపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ వివరించారు.

వ్యక్తిపై దాడి చేసిన వారిపై కేసు నమోదు

మడికొండ: ఓ వ్యక్తిపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు. మడికొండ గ్రామానికి చెందిన వల్లెపు రాజేష్‌పై అదే గ్రామానికి చెందిన జట్‌పట్ సామేల్, బాబు, శేఖర్, రాజ్‌కుమార్ దాడి చేసి దుర్భాషలాడారు. ఈమేరకు బాధితుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.